



# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం






సంపుటి : 3 | సంచిక : 303 | జూలై 1 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





**మన దునియా,హైదరాబాద్:జూన్ 30**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి,అధ్యక్ష తన తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్య వసర సమావేశం నిర్వహించనున్నారుకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా పూర్తిస్థాయి డిజిటల్ ఈ- కేబినెట్ జూలై 2 మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబే ద్కర్ తెలంగాణ సచివాలయం 6వ అంతస్తులో గల కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశం జరగ నుంది. కేబినెట్ భేటీ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు అజెండా రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేశాయి. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శు లు, వివిధ శాఖల కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన

## ఇక డాలర్‌తో పనిలేదు... భారత్-జపాన్ కీలక ఒప్పందం!

డాలర్‌ను పక్కనపెట్టి యెన్-రూపాయి ప్రత్యక్ష లావాదేవీలకు భారత్-జపాన్ సన్నాహాలు

ప్రధాని మోదీతో జపాన్ ప్రధాని సనాయె తకైచి భేటీలో కీలక చర్చ

తగ్గనున్న ఫారెక్స్, లావాదేవీల ఖర్చులు.. వేగవంతం కానున్న వాణిజ్యం

భారత్‌లో జపాన్ కంపెనీలకు ప్రోత్సాహం.. పెరగనున్న ప్రైవేట్ పెట్టుబడులు

త్వరలో ఆర్‌బీఐ, జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య అవగాహన ఒప్పందం

భారత్, జపాన్ దేశాల

(మిగతా 2వ పేజీలో..)



## ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్ కి ఊరట



హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో బండి సంజయ్‌పై కేసు నమోదు

అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేలు పంచుతోందని ఆరోపించిన సంజయ్

ఈ వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన హుజూరాబాద్ పోలీసులు

హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు

(మిగతా 2వ పేజీలో..)

## మంత్రి శ్రీధర్ బాబు దంపతులపై ఏఐ మార్ఫింగ్ వీడియోల కలకలం

**మన దునియా,హైదరాబాద్:జూన్ 30**

తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సతీమణి ఐఏఎస్ ఆఫీసర్ శైలజా రామయ్యర్ దంపతులపై ఏఐ మార్ఫింగ్ వీడియోలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. ఫేస్‌బుక్‌లో అభ్యంతరకర కంటెంట్‌తో కూడిన తప్పుడు వీడియోలను పోస్టు చేసి, వారి ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది శశిభూషణ్ కాశే ఫిర్యాదు చేశారు.ఏఐ సాయంతో నకిలీ వీడియోలను రూపొందించి సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం

(మిగతా 2వ పేజీలో..)




## ఓటు పోతే ప్రభుత్వ పథకాలూ పోవచ్చు.. 'సర్'పై డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు

ఓటు హక్కు కోల్పోవద్దని డీకే శివకుమార్ సూచన

ఓటు లేకపోతే పథకాలపై ప్రభావం ఉంటుందని హెచ్చరిక

కర్ణాటకలో మంగళవారం నుంచి ప్రత్యేక ఓటరు సవరణ ప్రారంభం

జులై 29 వరకు ఇంటింటి సర్వే

అక్టోబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై కర్ణాటక సీఎం డి.కె.శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 'సర్' ప్రారంభమైన సందర్భంగా

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# మంత్రి శ్రీధర్ బాబు దంపతులపై ఏఐ మార్ఫింగ్ వీడియోల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు నగదు అక్రమాలకు సంబంధించి మంత్రి శ్రీధర్ బాబును తప్పుడు రీతిలో చూపించేలా వీడియోలు క్రియేట్ చేసి ప్రసారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే బీఆర్ఎస్ మంథని పేరుతో నిర్వహిస్తున్న ఫేస్‌బుక్ పేజీ ద్వారా ఈ కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నట్లు ఫిర్యాదులో ప్రస్తావించారు. న్యాయవాది ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

# జులై 2 న సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ కీలక సమావేశం!

(మొదటి పేజీ తరువాయి)

అజెండా అంశాలను సర్క్యులేషన్ ద్వారా ఆమోదించి, వాటిని తెలుగు అనువాదం తో సహా సాధారణ పరిపాలన కేబినెట్ శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా తెచ్చిన కొత్త నిబంధనలు సమైక్య స్ఫూర్తిగా విరుద్ధంగా ఉండటంతో పాటు.. తెలంగాణ గ్రామీణ కూలీలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి ఈ అన్యాయాన్ని ఎదిరించేందుకు కేంద్ర నిర్ణయం వల్ల నష్టపోతున్న ఇతర రాష్ట్రాలన్నింటిని కలుపుకొని సుప్రీం కోర్టులో ఉమ్మడిగా న్యాయపోరాటం చేయాలని తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. మంత్రిమండలి సమావేశం జరిగే సమయంలో ఎలాంటి పరిపాలనా పరమైన ఇబ్బందు లు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కేబినెట్ సమావేశం ముగిసే వరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శు లు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులందరూ ఖచ్చితంగా తమ ప్రధాన కార్యాలయా ల్లో అందుబాటులో ఉండాలని సీఎస్ కె. రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్ కి ఊరట

(మొదటి పేజీ తరువాయి)

నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. అసలు విషయానికి వస్తే... హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచుకోం

## జోరందుకోనున్న వర్షాలు: విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు.. సముద్ర తీర ప్రాంతాల్లో హై అలర్ట్!

దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఊపందుకున్నాయి. వాతావరణ వ్యవస్థలో ఏర్పడిన రెండు అనుకూల పరిస్థితుల కారణంగా రానున్న రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. జులై మొదటి వారంలో ఈ వర్షాల తీవ్రత మరింత పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాస్త్రవేత్తల సమాచారం ప్రకారం.. ప్రస్తుతం దేశంలో రెండు వేర్వేరు అల్పపీడన ద్రోణులు క్రియాశీలకంగా ఉన్నాయి. అందులో మొదటిది గుజరాత్ తీరం నుంచి కేరళ తీరం వరకు పశ్చిమ తీరప్రాంతం వెంబడి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో అరేబియా సముద్రం నుంచి వీస్తున్న బలమైన గాలులు పశ్చిమ తీరప్రాంత రాష్ట్రాలలో భారీ వర్షాలకు కారణమవుతున్నాయి. ఇక రెండోది రాజస్థాన్ నుంచి ఈశాన్య బంగాళాఖాతాన్ని దాటుతూ దేశంలోని మధ్య, తూర్పు ప్రాంతాల గుండా వెళ్తోంది. ఈ రెండు వ్యవస్థల కలయిక వల్ల దేశవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా పెరగనుంది. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో కొంకణ్ తీరం, గోవా, కర్ణాటక సముద్ర తీర ప్రాంతాలతో పాటు కేరళలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లతో పాటు పశ్చిమ బెంగాల్, సిక్కింలలో రాబోయే మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయవ్య భారతంలోని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాలలో కూడా రుతుపవనాల కదలికలు మెరుగయ్యాయని, అక్కడ కూడా వర్షాలు ఊపందుకుంటాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వర్షాల తీవ్రత దృష్ట్యా ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఇక డాలర్‌తో పనిలేదు... భారత్-జపాన్ కీలక ఒప్పందం!

(మొదటి పేజీ తరువాయి)

మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి-యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు (non-residents) భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్ (RBI), జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్-జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

# ఓటు పోతే ప్రభుత్వ పథకాలూ పోవచ్చు.. 'సర్'పై డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని ప్రజలను కోరారు. ఓటు హక్కు కోల్పోతే భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే పరిస్థితి రావచ్చని హెచ్చరించారు. కర్ణాటకలో మంగళవారం నుంచి సర్ ప్రారంభమైంది. జులై 29 వరకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియ కొనసాగనుంది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ "ఓటు హక్కు అంటే జీవించే హక్కు" అని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ఆధారంగా అర్హత లేని రేషన్ కార్డుదారులను తొలగించే చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే దిశగా అడుగులు వేస్తున్నాయని తెలిపారు. అందుకే ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని నిర్ణయించింది. దీన్ని ఆన్‌లైన్‌తో పాటు సేవా కేంద్రాల ద్వారా కూడా పొందే అవకాశం కల్పించింది. ఓటరు వివరాల ధ్రువీకరణలో ఇది నివాస ఆధారంగా ఉపయోగపడనుంది. ఈ దశలో ఎలాంటి పత్రాలు తీసుకోబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఫారం పూర్తిగా నింపి సంతకం చేసి అధికారులకు అందజేయాలని ఓటర్లను కోరింది. మొత్తం ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతుందని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని అధికారులు తెలిపారు. ఆగస్టు 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కానుంది. సెప్టెంబర్ 4 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 7న ప్రకటించనున్నారు.

# సీఎం విజయ్ కీలక నిర్ణయం.. తమిళనాడులో ఇక అన్నీ ఏసీ బస్సులే

## ఇకపై కొత్తగా కొనేవన్నీ ఏసీ బస్సులే

## సీఎం విజయ్ ఆదేశించారని వెల్లడించిన రవాణా మంత్రి

## మారుమూల ప్రాంతాలకూ బస్సు సౌకర్యమే లక్ష్యం

## ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

## ఇటీవల 300 కొత్త బస్సులు ప్రారంభం

తమిళనాడులో ఇకపై ప్రభుత్వం కొనుగోలు చేసే కొత్త బస్సులన్నీ ఎయిర్ కండిషనింగ్ సౌకర్యంతోనే ఉండనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విజయ్ తమిళన్ పార్థిబన్ తెలిపారు. ప్రజలు సౌకర్యంగా ప్రయాణించేలా ప్రజారవాణా వ్యవస్థను ఆధునికీకరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పార్థిబన్ తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం చేరాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. ప్రతి కొత్త బస్సులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు ఉండాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలని సూచించినట్లు వెల్లడించారు. ఇటీవల విజయ్ ప్రభుత్వ బస్సులో ప్రయాణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రి విజయ్ 300 కొత్త ప్రభుత్వ బస్సులను ప్రారంభించారు. రూ.127.21 కోట్ల వ్యయంతో వీటిని కొనుగోలు చేశారు. ఇందులో 164 డీజిల్ బస్సులు, 136 బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా తయారైన సీఎన్‌జీ బస్సులు ఉన్నాయి. ప్రజారవాణాను మరింత ఆధునికంగా మార్చడంతో పాటు ప్రతి ప్రాంతానికి మెరుగైన బస్సు సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జూలై | బుధవారం | 1 | 2026



# "అడవిలోనే పాఠాలు.. అటవీ పునరుద్ధరణ, జీవవైవిధ్య పరిరక్షణపై ఎఫ్‌సీఆర్ఐ విద్యార్థుల క్షేత్ర పర్యటన"







**ఖానాపూర్ ఆర్సి మన దునియా;జన్నారం,జూన్ 30:**

హైదరాబాద్‌లోని ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) మూడవ సంవత్సరం విద్యార్థులు మంగళవారం ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో నిర్వహించిన క్షేత్ర పర్యటనలో పాల్గొని అటవీ సంరక్షణ, పునరుద్ధరణ, సుస్థిర అటవీ నిర్వహణపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్భంగా ఇందన్‌పల్లి రేంజ్‌లోని కలమడుగు బీట్, కంపార్ట్‌మెంట్ నెం. 333లో ఇటీవల అటవీ శాఖ స్వాధీనం చేసుకున్న అటవీ భూమిని సందర్శించిన విద్యార్థులు, అక్కడ చేపడుతున్న పునరుద్ధరణ, పరిరక్షణ చర్యలను పరిశీలించారు. అనంతరం వెదురు (బాంబూ) వర్క్‌షాప్‌ను సందర్శించి, వెదురు ప్రాసెసింగ్ విధానాలు, సుస్థిర అటవీ నిర్వహణలో దాని ప్రాధాన్యంపై అవగాహన పొందారు. తదుపరి బృందం బర్తన్‌పేట్ సెక్షన్‌లోని కమాన్‌పల్లి, నర్లాపూర్ సౌత్ బీట్‌లలో నిర్వహించిన ట్రెక్కింగ్ కార్యక్రమంలో పాల్గొంది. ఈ సందర్భంగా అటవీ పర్యావరణ వ్యవస్థ, జీవవైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలను క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డా. ఎన్.ఎస్. శ్రీనిధి, అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీమతి పర్సీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, శేషారం (ఎఫ్ఎస్ఓ), హనుమంతరావు (ఎఫ్ఎస్ఓ), రాజేశ్వర్ (ఎఫ్‌బీఓ), పోచయ్య (ఎఫ్‌బీఓ), డా. వెంకట్ (హెచ్ వై టిఐ సిఓఎస్), మహేష్ (టెక్నికల్ అసిస్టెంట్) పాల్గొని విద్యార్థులకు అటవీ సంరక్షణ, పునరుద్ధరణ, జీవవైవిధ్య పరిరక్షణ, సుస్థిర అటవీ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈ క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థులు అటవీ సంరక్షణ, అటవీ భూముల పునరుద్ధరణ, జీవవైవిధ్య పరిరక్షణ, సుస్థిర అటవీ నిర్వహణపై విలువైన ప్రాయోగిక పరిజ్ఞానం, క్షేత్రస్థాయి అనుభవాన్ని పొందారని ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) శ్రీ లక్ష్మీనారాయణ తెలిపారు.

# హోంగార్డులపై వేధింపులు ఆపాలి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

### అన్యాయ బదిలీలను వెంటనే రద్దు చేయాలి,డీజీపీకి విజ్ఞప్తి

**మన దునియా హుజూరాబాద్ నియోజకవర్గం**

రాష్ట్రంలో ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్న హోంగార్డులను అన్యాయంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే జోక్యం చేసుకుని హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల మంది, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 1,100 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. స్వల్ప వేతనంతో కుటుంబాలను పోషిస్తున్న హోంగార్డులను వందల కిలోమీటర్ల దూరాలకు బదిలీ చేయడం వల్ల వారు తీవ్ర ఆర్థిక, కుటుంబ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హుజూరాబాద్, వేములవాడ, మంథని, సిరిసిల్ల తదితర ప్రాంతాల మధ్య హోంగార్డులను తరచూ బదిలీ చేయడం వల్ల వారి జీవనం భారంగా మారిందన్నారు. నెలకు సుమారు రూ.30 వేల వేతనం పొందే హోంగార్డులు ప్రతిరోజూ దూర ప్రాంతాలకు ప్రయాణించడం సాధ్యంకాదని తెలిపారు. మానవీయ కోణంలో ఆలోచించి ఈ బదిలీలను వెంటనే పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. గతంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుల నుంచి అక్రమ వసూళ్లు జరిగినట్లు అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొంత మంది హోంగార్డులను ప్రతిపక్ష నాయకులను కలిశారనే పేరుతో బెదిరించడం, వారి వివరాలు సేకరించాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని విమర్శించారు. హోంగార్డులను వీలైనంత వరకు వారి సొంత జిల్లాల్లో లేదా కొత్త జిల్లా పరిధిలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, అన్యాయ బదిలీలను వెంటనే రద్దు చేసి హోంగార్డులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డీజీపీని కోరారు



# రైల్వే శాఖలో 6.557 పోస్టులకు నోటిఫికేషన్!

**మన దునియా,న్యూఢిల్లీ:జూన్ 30**

భారత్ రైల్వే శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న అన్నీ రైల్వే రీజియన్లలో.. టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ..రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పూర్తి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 6,557 పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం పోస్టుల్లో టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులు 323, గ్రేడ్ 3 పోస్టులు 6,565, ఉన్నాయని రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఇందుకోసం అర్హత కలిగిన అభ్యర్థులు ఈరోజు నుండి జులై 30 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రాక్ మెషిన్, బ్రిడ్జ్, డిజిల్ ఎలక్ట్రికల్/ మెకాని కల్, ఎలక్ట్రికల్/ మెకానికల్, ఎలక్ట్రి కల్/ టీఆర్ఎస్, ఈఎంయూ, ఫిట్టర్, వెల్డర్, కార్పెంట్ తదితర విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా ఉద్యోగాల తుది ఎంపిక ఉంటుంది. టెక్నీషియన్ గ్రేడ్ 1 సిగ్నల్ పోస్టులకు బీఎస్సీ లేదా డిగ్రీ లేదా డిప్లొమా ఉత్తీ ర్ణత కలిగి ఉండాలి. టెక్నీషియన్ గ్రేడ్ 3 పోస్టులకు పోస్టుల కు టెన్త్, ఐటీఐ, బీఎస్సీ, డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయోపరిమితి టెక్నీషియన్ గ్రేడ్ 1 పోస్టులకు 18 నుంచి 33 ఏళ్లు, టెక్నీషియ న్ గ్రేడ్ 3 పోస్టులకు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకో వచ్చు. దరఖాస్తు ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ. 500, ఎస్సీ/ ఎస్టీ/ ఎక్స్‌సర్వీస్‌మెన్/ పీడబ్ల్యూబీడీ/ మహిళలు/ ట్రాన్స్‌జండర్/ ఈబీసీ అభ్యర్థులు రూ.250 చొప్పున చెల్లించవల్సి ఉంటుందన్నారు. సీబీటీకు హాజరైన వారికి రూ.400 వరకు రిఫండ్ బ్యాంక్ ఛార్జీలు మినహాయించి చేస్తారు. ఆన్‌లైన్ రాత పరీక్ష, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుందని రిక్రూట్ బోర్డు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.



# చిన్నారి వేదాంతిని పరామర్శించిన భూక్యా జాన్సన్ నాయక్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; జూన్30.**



ఇంద్రవెల్లి మండలం యమైకుంట గ్రామానికి చెందిన అరవింద్ దంపతుల 8 నెలల కుమార్తె చిన్నారి వేదాంతి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న ఆయన, చిన్నారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులను కోరారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచిస్తూ మనోధైర్యం నింపారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదగాలని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబ సభ్యులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. చిన్నారి వేదాంతి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైతే తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి "కబీర్ కోహినూర్ సమ్మాన్" పురస్కారం అందుకున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు





**మన దునియా, జూన్ 30, మంచిర్యాల జిల్లా**

మంచిర్యాల జిల్లా మందమర్రి కళ్యాణిఖనిలోని సింగరేణి కాలరీస్ పాఠశాలలో సీనియర్ హిందీ పండితులుగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావు ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారం "కబీర్ కోహినూర్ సమ్మాన్" అందుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అఖిల్ భారతీయ కబీర్ మఠం, సద్గురు కబీర్ ఆశ్రమ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 629వ కబీర్ జయంతి మహోత్సవాల్లో భాగంగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. జూన్ 28, 29 తేదీల్లో ఘనంగా జరిగిన ఈ వేడుకల్లో హిందీ భాషా, సాహిత్య రంగాలకు విశేష సేవలు అందించినందుకు గాను విద్యాసాగర్ జామి ప్రసాదరావును ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇది ఆయన అందుకున్న ఐదవ జాతీయ స్థాయి పురస్కారం కావడం విశేషం. హిందీ సాహిత్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ "కబీర్ కోహినూర్ సమ్మాన్"తో సత్కరించారు. అదేవిధంగా కబీర్ మహోత్సవ కార్యక్రమంలో విద్యా, సామాజిక అభివృద్ధికి దోహదపడేలా విద్యాసాగర్ జామి ప్రసాదరావు సంపాదకత్వంలో వెలువడిన పలు గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యావేత్తలు, సాహితీవేత్తలు, కవులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అవార్డు అందుకోవడం పట్ల విద్యాసాగర్ జామి ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేస్తూ, హిందీ భాషా సాహిత్య సేవలో మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

# జి ఎం కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టిన సింగరేణి ఏరియా అధికారుల సంఘం

**మన దునియా, జూన్ 30,మంచిర్యాల జిల్లా**

మందమర్రి ఏరియా అధికారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక జీఎం కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా సీఎంవో ఏఐ అధ్యక్షుడు ఎస్ రమేష్ మాట్లాడుతూ సింగరేణి అధికారుల సమస్యల పరిష్కారానికి గత 15 రోజులుగా ఆందోళన చేపట్టడం జరిగిందని ఈరోజు నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించామని సరైన హామీ ఇచ్చేవరకు పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. అధికారుల ముఖ్య డిమాండ్లైన రెండు సంవత్సరాల పిఆర్పి చెల్లింపులో జాప్యం మీ అప్రిడేషన్ ఫీజు రియంబర్స్మెంట్ ఫ్రీ ఎలక్ట్రిసిటీ బిల్ సమస్యలపై యాజమాన్యం దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆలస్యం చేసినచో పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈరోజు చేపట్టిన నిరాహార దీక్షలో సంఘం అధ్యక్షుడు ఎస్ రమేష్ తో పాటు డీజీఎం అబ్దుల్ ఖదీర్, దేవులపల్లి శ్రీనివాస్ దీక్షలో కూర్చుని ప్రారంభించారు. వీరితోపాటు అధికారుల సంఘం వైస్ ప్రెసిడెంట్ వర్ధన్ జాయింట్ సెక్రెటరీ సంతోష్ రవి, మందమర్రి కి చెందిన సీనియర్ జూనియర్ అధికారులు పాల్గొన్నారు.



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం


# మాదకద్రవ్య రహిత జిల్లాగా కొమరం భీం ఆసిఫాబాద్: కలెక్టర్ ఆదేశాలు

**మన దునియా,కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాన**



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మెడికల్ షాపులు, బెల్ట్ షాపులు, కల్లు డిపోలపై తనిఖీలు నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలల సమీపంలోని పాన్ టేలాలను కూడా తనిఖీ చేయాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

## గ్రామపాలన అధికారుల సంక్షేమ సంఘం ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాజేడు మండల జిపి ఓ ల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎస్కే మున్వర్

**మన దునియా, వాజేడు ,జూన్ 30**



ములుగు జిల్లా గ్రామ పాలన అధికారుల సంక్షేమ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుల సంవత్సరంలో సంఘం జిల్లా బాడీ సమక్షంలో జిల్లా అధ్యక్షులు ఎస్ సర్వేశ్వరరావు ఉపాధ్యక్షులు సూరయ్య జిల్లా కమిటీ సభ్యులు గంపల శంకర్ జిపిఓ సమ్మక్క జిపిఓ జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో 30-06-2026 న వాజేడు తాసిల్దార్ కార్యాలయంలో మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జిపిఓల సమక్షంలో మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల కమిటీ అధ్యక్షులు ,ఎస్కే మున్వర్, ఉపాధ్యక్షులు, గంపల శంకర్, ప్రధాన కార్యదర్శి, కోరం అరుణ, కోశాధికారి, వెంకట నరసమ్మ తోలేం, ప్రచార కార్యదర్శి, ఇండ్ల రజిత, మహిళా విభాగం సంస్కృతిక కార్యదర్శి, కనుకు సమ్మక్క, క్రీడల విభాగం, దాసరి సారయ్య, మహిళా విభాగం, శిరీష సభ్యులను మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# వ్యాపారిని హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ఇద్దరు నిందితుల అరెస్ట్

**సంచలనం సృష్టించిన వ్యాపారి హత్య కేసును పోలీసులు**

**మన దునియా,షాద్‌నగర్:జూన్ 30**

షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన వ్యాపారి హత్య కేసును పోలీసులు ఛేదించారు. వ్యాపారవేత్త మహ్మద్ హాజీని హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు షాద్‌నగర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ఎసిపి) లక్ష్మీనారాయణ వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ సీతారాం తదితరులతో కలిసి ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన మహ్మద్ హాజీ (35) ఈ నెల 22న అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బిజినపల్లికి చెందిన పానుగంటి అరవింద్ జీ (36), వీరకారి శివాజీ (35)లను అనుమానితులుగా గుర్తించారు. భూవ్యాపార లావాదేవీలు, ఆర్థిక విభేదాల నేపథ్యంలో ఇద్దరు నిందితులు మహ్మద్ హాజీని కారులో తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం మృతదేహాన్ని షాద్‌నగర్ సమీపంలోని ట్రూ ల్యాండ్‌మార్క్--9ఈఎక్స్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలోని ఖాళీ స్థలంలో పూడ్చిపెట్టినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. నిందితుల సూచనల మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉపయోగించిన కారు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూన్ 29న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను షాద్ నగర్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ అభినందించినట్టు ఎసిపి లక్ష్మీనారాయణ తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు..




# మహిళా భద్రతకు రంగంలోకి 'షీ నేత్ర టీమ్స్'

**మన దునియా,హైదరాబాద్:జూన్ 30**

హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు, సినిమా హాళ్లు, విద్యా సంస్థలతోపాటు.. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో మహిళల ఆత్మగౌరవానికి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టు రట్టు చేసేందుకు పోలీసు విభాగం సరికొత్త అస్త్రం షీ నేత్రను రంగంలోకి దింపింది.

**అత్యాధునిక కెమెరాలు, డిటెక్టర్లతో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్**




హైదరాబాద్ సిటీ: హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు, సినిమా హాళ్లు, విద్యా సంస్థలతోపాటు.. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో మహిళల ఆత్మగౌరవానికి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టు రట్టు చేసేందుకు హైదరాబాద్ పోలీసు విభాగం సరికొత్త అస్త్రం షీ నేత్రను రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. నిఘా కెమెరాల ముప్పు నుంచి రక్షణ కల్పించేందుకు సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా 'షీ నేత్ర' టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఏప్రిల్ -10న సిటీ కమిషనరేట్ పరిధిలోని ఏడు జోన్లకు ఒక్కో బృందం చొప్పున మొత్తం ఏడు ప్రత్యేక షీ నేత్ర టీమ్‌లు ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ కొనసాగించారు. అందులో భాగంగా అత్యాధునిక కెమెరాలు, డిటెక్టర్ల వినియోగం, నిబంధనల ఎస్‌వోపీపై రెండు దశల్లో పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో షీటీమ్స్ బృందాలు షాపింగ్ మాల్స్‌లోని ట్రయల్ రూమ్‌లు, ఆస్పత్రులు, హోటళ్లు, హాస్టళ్లలో రహస్యంగా కెమెరాలు అమర్చి మహిళల గోప్యతకు భంగం కలిగించే ఘటనలపై ఉక్కుపాదం మోపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఈ ఏడు బృందాల ద్వారా నగరవ్యాప్తంగా ముమ్మరంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయని సీపీ తెలిపారు. తమ ప్రాంగణాల్లోని ప్రైవేటు ప్రదేశాల్లో రహస్య కెమెరాలు లేవని నిర్ధారించుకోవాల్సిన పూర్తి బాధ్యత ఆయా యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. ప్రతి సంస్థ తప్పనిసరిగా 'కస్టమర్ సేఫ్టీ ఇన్ చార్జ్'ని నియమించుకోవాలని, వీరు షీ టీమ్స్‌కు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించాలని సూచించారు. మహిళల భద్రత సమిష్టి బాధ్యతని, ప్రజలు ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులను గుర్తిస్తే వెంటనే డయల్ 100/112 లేదా షీ టీమ్స్ నంబర్ 9490616555కు సమాచారం అందించాలని సీపీ వెల్లడించారు.

# పశ్చిమ బెంగాల్లో అగ్నిప్రమాదం.. 15 మందికి గాయాలు!

**మన దునియా,పశ్చిమ బెంగాల్:జూన్ 30**




పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హల్దియా రిఫైనరీలో ఈరోజు (మంగళవారం) తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. నాఫ్తా రవాణా కోసం ఉపయోగిస్తున్న పైప్‌లైన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో కనీసం 15 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈరోజు తెల్లవారుజామున 4:00 నుంచి 5:00 గంటల మధ్య నాఫ్తా తరలిస్తున్న పైపులైన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో సమీపంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనలో భారీ మంటలు ఎగిసిపడుతున్నాయి. స్థానికులు, ఫైర్ సిబ్బంది కలిసి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.గాయపడిన వారిని వెంటనే రక్షించి హల్దియా సబ్-డివిజనల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా రిఫైనరీ పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. అయితే, ఈ అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. పైప్‌లైన్‌లో సాంకేతిక లోపమా, లీకేజీ కారణమా లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం సంభవించిందా అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది..

# నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలి-ఏఐటియుసి డిమాండ్

**జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా**

**హనుమకొండ జిల్లా30 జూన్ 2026**

హనుమకొండ జిల్లా లోని విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ఏఐటియుసి ధర్నా నిర్వహించడం జరిగింది. సెంట్రలైజ్ విధానం పేరుతో పాఠశాల వంట పనిని ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పరాదని, కోడిగ్రుడ్లు నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలి తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మద్యాహ్న భోజన నిర్వాహకులు రాష్ట్రం లో 54,200 మంది గత 24 సంవత్సరముల నుండి విధులు నిర్వహిస్తున్నారు, వారంలో 3 రోజులు కోడి గుడ్లు పెట్టాలని ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు, ప్రభుత్వం ఇస్తున్నవి రూ 6 మాత్రమే మార్కెట్లో ఒక్క గుడ్డుకు రూ 7 నుండి రూ 8 లకు లభిస్తున్నది. మేము రెండు రూపాయల నష్టంతో బయట తెచ్చి ఎలా పెట్టాలి. ప్రభుత్వ అధికారులు ఆలోచన చేయాలి. అందుకే కోడి గుడ్లు, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాము. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెన్యు చార్జీలు విద్యార్థికి ఒక్కంటికి రూపాయలు 25 ఇవ్వాలి అని మేము మీ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియపరుస్తు మా సమస్యలను పరిష్కరించే విదంగ చూడాలని అమరికి మనవి చేయుచున్నాము.

డిమాండ్స్ :-

1. వంట కార్మికులకు విద్యాశాఖ నుండి గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

2. వంట కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ॥26,000/- ఇవ్వాలి.

3. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా పథకం అమలు చేయాలి.

4. సెంట్రలైజ్ కిచెన్ విధానం ద్వారా పాఠశాల వంట కార్యక్రమాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలి.

5. వంట కార్మికులకు ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్., పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

6. వంట కార్మికులకు పని భద్రత కల్పిస్తు విధులనుండి తొలగించవద్దు..

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జక్కు రాజ్ గౌడ్, అధ్యక్షురాలు గడ్డం లలిత ప్రెసిడెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మల రాంమూర్తి మరియు మధ్యాహ్న భోజనం వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు....



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం
జూలై । బుధవారం । 1 । 2026



# పేరూరు గ్రామపంచాయతీలో సివిల్ రైట్స్





**డే గురించి వివరించిన పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ జిపిఓ ఎస్కే మున్వర్**

**మన దునియా, వాజేడు ,జూన్ 30**

యువకులకు రైతు కుటుంబాలకు నిర్లక్ష్యానికి గురై యాక్సిడెంట్ బారిన పడకూడదని మారకద్రవ్యాలు డ్రగ్స్ విక్రయాలు విషయాలను పిల్లలు వాటికి జోలికి పోకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని ప్రతి తల్లిదండ్రి సాయంత్రం పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు ఏం చేస్తున్నారు అనే విషయాన్ని తెలుసుకోవాలి తప్పుడు విషయాలు జరిగినప్పుడు పోలీసు వారు తమ పిల్లలపై కేసు నమోదు అవుతుందని తెలిసినప్పుడు తల్లిదండ్రులు మేము అమాయకులం సార్ చదువుకోలేదు సార్ అనే విషయాలు ముఖ్యంగాఆలోచించాలని పిల్లలు తమ ఫ్రెండ్స్ తో కలిసి సరదాగా ఎంజాయ్ చేయాలని ఆలోచనలు డ్రగ్స్ లాంటివి తీసుకోవటం చేయటం వలన వారికి తమ భవిష్యత్తు ఏం జరుగుతుందో తెలియని వయసులో ఎంజాయ్ చేయడం జరుగుతుంది వాటర్ ఫాల్స్ లను ఇలాంటి ఏరియాలలో ఫ్రెండ్స్ తో కలిసి తిరగటం వాళ్ళ ఆలోచన భావాలు చెడుగా ఆలోచన వైపు మళ్ళినప్పుడు తల్లిదండ్రులు వారిని అబ్జర్వేషన్ చేసి చూడాలని తల్లిదండ్రులు కుటుంబ పరమైన సమస్యలతో ఉండి పిల్లలు ఏమి చేస్తున్నారు ఏం ఎలా తిరుగుతున్నారు అనే విషయాలు పట్టించుకోకుండా ఉంటే పూర్తిగా డ్రగ్స్ కు అలవాటై ప్రాణాపాస్థితికి పోయాక అప్పుడు ఆలోచించినా ప్రయోజనం ఏమి ఉండదని మోటార్ వెహికల్ మీద వెళ్లేటప్పుడు కంపల్సరిగా హెల్మెట్ పెట్టుకొని వెళ్లాలని ఇటువంటి విషయాల్లో తప్పుడుగా పోలీసుల దృష్టికి దొరికినప్పుడు కఠినమైన చర్యలు తీసుకుని వారిపై శిక్ష విధించబడుతుంది అప్పుడు ఆలోచించిన ప్రయోజనమేముండదని ఆయన అన్నారు

# ఉద్యోగ విరమణ చేసిన అదనపు కలెక్టర్ కు ఘనంగా వీడ్కోలు







**కలెక్టరేట్ లో అట్టహాసంగా సన్మాన మహోత్సవం**

**మన దునియా:నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా విధులు నిర్వర్తిస్తూ, మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన ఎస్.కిరణ్ కుమార్ కు ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సన్మాన మహోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి, ఉద్యోగ విరమణ చేస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. అదనపు కలెక్టర్ గా కిరణ్ కుమార్ అందించిన సేవలను కొనియాడారు. ఎంతో సమర్థత కలిగిన అధికారి పదవీ విరమణ చేస్తుండడం జిల్లా యంత్రాంగానికి ఎంతో లోటు అని అన్నారు. తన మొదటి పోస్టింగ్ భద్రాద్రి జిల్లాలో ట్రైనీ కలెక్టర్ గా ఇదివరకు కిరణ్ భద్రాద్రి జిల్లాలో ట్రైని కలక్టర్ గా ఇదివరకు కిరణ కుమార్ తో కలిసి పని చేశానని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తాను కలెక్టర్ గా కొనసాగుతున్న నిజామాబాద్ జిల్లాలో ఆయన పదవీ విరమణ చేయడం కాకతాళీయం అన్నారు. ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉండే రెవెన్యూ శాఖలో డీఆర్గా, అదనపు కలెక్టర్ గా ఎంతో సమర్థంగా విధులు నిర్వహించారని, ప్రత్యేకించి నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, రెవెన్యూ శాఖా పరమైన అంశాలలో ఒత్తిడికి గురి కాకుండా ఓపికతో బాధ్యతాయుతంగా పని చేశారని కొనియాడారు. ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని, ముప్పై సంవత్సరాలకు పైగా వివిధ హోదాలలో ఎలాంటి రిమార్క్స్ లేకుండా సేవలు అందించడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. అనేక సందర్భాల్లో కుటుంబ సభ్యులతో సమయం గడిపే అవకాశం లేకుండా ఉద్యోగులు విధి నిర్వహణలో నిమగ్నం కావాల్సి వస్తుందని అన్నారు. పదవీ విరమణ చేస్తున్న అదనపు కలెక్టర్, వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. నచ్చిన వ్యాపకాన్ని ఎంచుకుని మానసిక ప్రశాంతతతో, కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకరమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు మాట్లాడుతూ, ఉన్నత హోదాలో కొనసాగినప్పటికీ ఉద్యోగాలతో కిరణ్ కుమార్ ఎంతో సౌమ్యంగా, స్నేహభావంతో మెలిగేవారని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో అదనపు కలెక్టర్ గా తాను సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూర్తి సహకారం అందించారని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ గీత, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)కు అదనపు బాధ్యతలు

**నిజామాబాద్ జిల్లా:మన దునియా ప్రతినిధి:**



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా కొనసాగుతున్న వి.భుజంగరావుకు, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా కొనసాగిన కిరణ్ కుమార్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు, అదనపు బాధ్యతలు అప్పగించారు.

# కాంగ్రెస్ జెండాకు ఎస్సై సెల్యూట్..! ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి..




**నిజామాబాదు జిల్లా మన మనదునియా ప్రతినిధి:**

కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. కాంగ్రెస్? పార్టీ జెండాకు సెల్యూట్? చేశారనే ఆరోపణలు వివాదానికి దారి తీశాయి.

**ఎస్సై సెల్యూట్ ఎమ్మెల్యే ప్రశాంత్?రెడ్డి తీవ్ర విమర్శలు..**

కాంగ్రెస్ పార్టీ గాంధారి మండల కార్యాలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గాంధారి ఎస్సై మహేందర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ జెండాకు సెల్యూట్ చేశారనే ఆరోపణలు రాజకీయ వర్గాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఇందుకు సంబంధిత ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఎస్సై హోదాలో ఉంటూ విధి నిర్వహణను విస్మరించి ఒక రాజకీయ పార్టీ జెండాకు సెల్యూట్ చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో పోలీస్ వ్యవస్థ కాంగ్రెస్ పార్టీకి జేబు సంస్థగా మారిందని, పోలీసులు కాంగ్రెస్ తాబేదార్లుగా పని చేస్తున్నారని ఆయన విమర్శించారు.

**ఎస్సై సెల్యూట్ డీజీపీ చర్యలు తీసుకోవాలి..**

రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులను అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించే పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని ప్రశాంత్?రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థ నిష్పాక్షికతపై ప్రజల్లో అనుమానాలు కలిగేలా ఇటువంటి చర్యలు ఉన్నాయని వేముల అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై అధికార పార్టీ ఆదేశాల మేరకు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. గాంధారిలో జరిగిన ఘటనే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీ వెంటనే విచారణ జరిపించి ఎస్సైపై తగిన చర్యలు తీసుకోవాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.



# పంజాబ్ కింగ్స్ ఆటగాడు శశాంక్ సింగ్‌పై దాడి కేసు.. తనపై కుట్ర జరిగిందంటున్న క్రికెటర్

తన నివాసంలో పనిచేసే వ్యక్తిపై దాడి చేశారన్న ఆరోపణలపై పంజాబ్ కింగ్స్ ఆటగాడు, యువ క్రికెటర్ శశాంక్ సింగ్ స్పందించాడు. ఈ ఆరోపణలను అతడు తీవ్రంగా ఖండించాడు. తనపైనా, తన కుటుంబంపైనా కుట్రపూరితంగా కేసు పెట్టారని, తమ కుటుంబాన్ని ఇరికించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించాడు. వంటవాడినని చెప్పి పనికి వచ్చిన వ్యక్తి అబద్ధం చెప్పాడని, అతను ఇంట్లో అనుమానాస్పదంగా వీడియోలు తీశాడని వివరణ ఇచ్చాడు.



అసలేం జరిగింది?

విపేంద్ర సింగ్ తోమర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భోపాల్‌లోని రాతిబాద్ పోలీసులు క్రికెటర్ శశాంక్ సింగ్, అతడి తండ్రి శైలేష్ సింగ్ (మధ్యప్రదేశ్ మాజీ స్పెషల్ డీజీపీ), వారి డ్రైవర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తనపై దాడి చేసి, దుర్భాషలాడారని, తన మొబైల్ ఫోన్ లాక్కున్నారని తోమర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ వివాదంపై శశాంక్ సింగ్ 'ఐఏఎన్ఎస్'తో మాట్లాడుతూ తన వాదన వినిపించాడు. "మొదటగా నేను చెప్పేది ఏంటంటే... అతను అసలు వంటవాడే కాదు. వంటవాడినని చెప్పి పనికి వచ్చాడు. కానీ, వంట చేయమని అడిగితే తనకు రాదని ఒప్పుకున్నాడు" అని శశాంక్ తెలిపాడు. ఇంట్లో అతను అనుమానాస్పదంగా ప్రవర్తించాడని, గదులు, అలంకరణ వస్తువులను ఫొటోలు, వీడియోలు తీస్తుండటంతో తమకు అనుమానం వచ్చిందని చెప్పాడు. "అపరిచిత వ్యక్తి ఇంట్లో వీడియోలు తీయడం ఎవరికీ నచ్చదు. అందుకే అతని ఫోన్ తీసుకుని, వాటిని డిలీట్ చేయమని మాత్రమే అడిగాం. భవిష్యత్తులో ఇది దొంగతనానికి దారితీయవచ్చనే అనుమానంతోనే అలా చేశాం" అని శశాంక్ వివరించాడు. దాడి, నిర్బంధం ఆరోపణలు అవాస్తవం తోమర్‌ను కొట్టడం లేదా నిర్బంధించడం వంటి ఆరోపణలను శశాంక్ సింగ్ పూర్తిగా తోసిపుచ్చాడు. "మూడు రోజులు అతడిని బందీగా ఉంచామన్న ఆరోపణ అత్యంత తీవ్రమైనది. మేం గౌరవప్రదమైన కుటుంబం నుంచి వచ్చాం. అలాంటి పనులు ఎప్పటికీ చేయం. మా ఇంట్లో ఎలాంటి దాడి గానీ, దూషణలు గానీ జరగలేదు. అతను ఇంటి నుంచి వెళ్లేటప్పుడు తన ఫోన్‌ను తనతోనే తీసుకెళ్లాడు" అని స్పష్టం చేశాడు. ఇంట్లో వీడియోలు తీసినందుకు తన తల్లి అతడిని మందలించిందే తప్ప, ఎలాంటి దురుసు ప్రవర్తన జరగలేదని అన్నాడు. తమ కుటుంబాన్ని ఇరికించేందుకే ఎవరో ఈ కుట్ర పన్నుతున్నారని శశాంక్ అనుమానం వ్యక్తం చేశాడు.

పోలీసుల దర్యాప్తు

ఈ కేసుపై అడిషనల్ డీసీపీ అనిల్ శర్మ మాట్లాడుతూ.. "వంట మనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి కేసు నమోదు చేశాం. ముగ్గురిపై కేసు ఫైల్ అయింది. ప్రస్తుతం ఈ విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతోంది" అని తెలిపారు.ఫిర్యాదు ప్రకారం.. రేవా జిల్లాకు చెందిన విపేంద్ర సింగ్ తోమర్ జూన్ 25న నెలకు రూ.15,000 జీతానికి శశాంక్ సింగ్ ఇంట్లో వంటవాడిగా చేరాడు. పనిలో లోపాలున్నాయని చెప్పి తన ఫోన్‌ను లాక్కున్నారని, జూన్ 28న ఫోన్ తిరిగి అడగ్గా ముగ్గురూ కలిసి తనపై దాడి చేసి, బయటకు గెంటేశారని, తన ఫోన్ నుంచి రూ.1000 బస, భోజన ఖర్చుల కింద బదిలీ చేసుకున్నారని ఆరోపించాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 296(బి), 115(2), 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పటివరకు వైభవ్ సూర్యవంశీకి వెయిటింగ్ తప్పకపోవచ్చు: పుజారా

**యువ సంచలనం వైభవ్‌కు భారత మాజీ క్రికెటర్ పుజారా కీలక సూచనలు**

**ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అతనికి వెంటనే అవకాశం రాకపోవచ్చని వ్యాఖ్య**

**తొలి మూడు మ్యాచ్‌ల వరకు వైభవ్ వేచి ఉండాల్సి రావచ్చన్న మాజీ క్రికెటర్**

**తన చుట్టూ ఉన్న హైప్‌ను పట్టించుకోకుండా ఆటపైనే దృష్టి పెట్టాలని హితవు**

**అవకాశం వచ్చినప్పుడు ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడాలని సలహా**

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి టీమిండియా సీనియర్ ఆటగాడు, మాజీ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా విలువైన సలహాలు ఇచ్చాడు. రేపటి నుంచి ఇంగ్లండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు వైభవ్ ఎంపికైన నేపథ్యంలో అతని చుట్టూ పెరుగుతున్న ప్రచారం ఒక ఆటంకంగా మారకూడదని పుజారా హితవు పలికాడు. భారత జట్టు ప్రస్తుత టాప్ ఆర్డర్ చాలా స్థిరంగా ఉన్నందున, వైభవ్‌కు తుది జట్టులో వెంటనే చోటు దక్కడం కష్టమని అభిప్రాయపడ్డాడు. దీర్ఘకాలిక విజయం కోసం సహనం, సరైన సన్నద్ధత చాలా కీలకమని పుజారా చెప్పాడు.ఈ పర్యటనకు ముందు పుజారా మాట్లాడుతూ.. "ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ చుట్టూ చాలా హైప్ ఉంది. ఒక యువ ఆటగాడిగా, తన గురించి బయట వస్తున్న మాటలను అస్సలు పట్టించుకోకూడదు. బయటి ప్రపంచం నుంచి వచ్చే శబ్దాలను పక్కనపెట్టి, కేవలం తన ఆటపైనే దృష్టి పెట్టాలి" అని సూచించాడు. ఇలాంటి సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండటం చాలా ముఖ్యమని పేర్కొన్నాడు.జట్టు ఎంపిక గురించి పుజారా మాట్లాడుతూ.. "వైభవ్ మానసికంగా సిద్ధంగా ఉన్నప్పటికీ, జట్టులోకి ఎంపికవ్వడం వేరే విషయం. ఇంగ్లండ్ సిరీస్‌లో అతనికి వెంటనే అవకాశం వస్తుందని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే భారత జట్టు తమ టాప్-3ని మార్చడానికి ఇష్టపడదు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి నాణ్యమైన బ్యాటర్లు టీ20 ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించారు. కాబట్టి తొలి మూడు మ్యాచ్‌ల వరకు వైభవ్ వేచి ఉండాల్సి రావచ్చు" అని స్పష్టం చేశారు. ప్రతిభ ఉన్నంత మాత్రాన జట్టులో చోటు దక్కుతుందని చెప్పలేమని, సరైన సమయం కోసం ఎదురుచూడాలని అన్నాడు. ఒకవేళ అవకాశం వస్తే ఎలా ఆడాలో కూడా పుజారా వివరించాడు. "అవకాశం వచ్చినప్పుడు అతను ప్రశాంతంగా, నిలకడగా ఉండటమే కీలకం. భారీ స్కోర్లు చేయాలనే ఒత్తిడిని తనపై తాను పెట్టుకోకూడదు. మైదానంలోకి వెళ్లి ఎలాంటి బెరుకు లేకుండా స్వేచ్ఛగా తన ఆటను తాను ఆడాలి" అని సలహా ఇచ్చాడు. అలాగే, ఇంగ్లండ్‌లోని పరిస్థితులు భిన్నంగా ఉంటాయని పుజారా హెచ్చరించాడు. "ఐపీఎల్‌లో అతను కనబరిచిన ప్రదర్శనను ఇంగ్లండ్ పరిస్థితుల్లో పునరావృతం చేయడం అంత సులభం కాదు. అందుకే అతను బాగా సిద్ధమవ్వాలి, అక్కడి వాతావరణానికి, పిచ్‌లకు అలవాటు పడాలి. ఒకసారి అవగాహన పెంచుకున్నాక, బంతిని చూసి దానికి తగ్గట్టు ఆడటమే ముఖ్యం. మిగతావన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి" అని పుజారా పేర్కొన్నాడు.



# బెంగళూరుకు మకాం మార్చిన హార్దిక్ పాండ్యా!



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన కెరీర్‌కు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకున్నాడు. తన మకాం ముంబై నుంచి బెంగుళూరుకు మార్చాడు. తన కెరీర్ ముగిసేంత వరకు బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జూజు) లోనే శిక్షణ పొందాలని నిర్ణయించుకున్నాడు. సాధారణంగా జాతీయ జట్టు ఆటగాళ్లు పునరావాసం, ఫిట్‌నెస్ పరీక్షలు లేదా క్యాంపుల కోసం మాత్రమే సీఓఈని వినియోగిస్తారు. కానీ, పూర్తిస్థాయి శిక్షణ కోసం ఇక్కడికి మకాం మార్చిన తొలి ప్రముఖ భారత క్రికెటర్‌గా హార్దిక్ నిలిచాడు. 32 ఏళ్ల హార్దిక్, బెంగుళూరు శివార్లలో సీఓఈకి సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ముంబైలోని తన ఇంటి నుంచి ప్రతిరోజూ శిక్షణకు ప్రయాణించడం కష్టంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్ కావడంతో అతనికి సీఓఈలోని అత్యాధునిక సౌకర్యాలు, గాయాల నిర్వహణ, నైపుణ్య శిక్షణ వంటివి అందుబాటులో ఉంటాయి. అక్కడ తన సొంత ఫిజియోథెరపిస్ట్, స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్‌తో పాటు, సొంత ఖర్చులతో నెట్ బౌలర్లను కూడా ఏర్పాటు చేసుకుంటున్నాడు. గత ఆరు నెలలుగా తొడ కండరాల గాయం (క్వాడ్రిసెప్స్ ఇంజ్యూరీ) నుంచి కోలుకోవడానికి హార్దిక్ పాండ్యా సీఓఈలోనే ఎక్కువ సమయం గడిపాడు. ఈ గాయం కారణంగానే ప్రస్తుతం జరుగుతున్న ఇంగ్లండ్ పర్యటనకు కూడా దూరమయ్యాడు. రాబోయే 5-6 ఏళ్ల పాటు భారత్ తరఫున వైట్-బాల్ క్రికెట్ ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హార్దిక్ పాండ్యా తెలిపాడు. త్వరలో జరగనున్న జింబాబ్వే టీ20 సిరీస్‌కు అందుబాటులో ఉంటాడో లేదో ఇంకా స్పష్టత రాలేదు.


## నాలుగుసార్లు ఛాంపియన్‌కు చుక్కలు.. జర్మనీని చిత్తు చేసిన పరాగ్వే

ఫిఫా వరల్డ్ కప్‌లో పెను సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా, నాలుగుసార్లు ఛాంపియన్‌గా బరిలోకి దిగిన జర్మనీకి పరాగ్వే ఊహించని షాకిచ్చింది. నేడు జరిగిన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో పెనాల్టీ షూటౌట్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో పరాగ్వే 4-3 తేడాతో చారిత్రక విజయం సాధించి రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. నిర్ణీత సమయానికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో ఫలితం కోసం పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. వరల్డ్ కప్ చరిత్రలో పెనాల్టీ షూటౌట్‌లో జర్మనీ ఓడిపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అదే సమయంలో వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లో పరాగ్వే గెలవడం కూడా ఇదే ప్రథమం.ఈ చారిత్రక విజయం అనంతరం పరాగ్వే హెడ్ కోచ్ గుస్తావో అల్ఫారో భావోద్వేగంతో స్పందించాడు. తన ఆటగాళ్లను యోధులుగా అభివర్ణించాడు. "మ్యాచ్‌కు ముందు నా దగ్గర 26 మంది యోధులు ఉన్నారు. కానీ, మ్యాచ్ తర్వాత వాళ్లు లెజెండ్స్‌గా మారిపోయారు. బహుశా మేము తర్వాతి రౌండ్‌లో ఓడిపోవచ్చు, లేదా గెలవొచ్చు. కానీ, ఈ మ్యాచ్ మాత్రం ఒక చారిత్రక ఘట్టం" అని అన్నాడు. తమ ఆటగాళ్ల నేపథ్యాన్ని, జర్మనీ ఆటగాళ్ల నేపథ్యాన్ని పోలుస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. "మా ప్రత్యర్థులు యూరప్‌లోని అత్యుత్తమ అకాడమీల్లో శిక్షణ పొందారు. కానీ, మేము ఎర్రమట్టి నేలల నుంచి వచ్చాం. మా తల్లిదండ్రులు చేసిన త్యాగాల వల్ల, బూట్లు లేకుండా ఫుట్‌బాల్ ఆడుతూ కలలను సాకారం చేసుకోవడం నేర్చుకున్నాం. ఇది మా మూలాల బలం" అని వివరించాడు.ఈ మ్యాచ్‌లో హీరోగా నిలిచిన పరాగ్వే గోల్ కీపర్ ఓర్లాండో గిల్, షూటౌట్‌లో రెండు కీలక పెనాల్టీలను అడ్డుకుని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్నాడు. తన ప్రదర్శన వెనుక కఠోర శ్రమ ఉందని తెలిపాడు. "ప్రతి ఆటగాడిని, ప్రతి అంశాన్ని, ప్రతి చిన్న విషయాన్ని నేను విశ్లేషించాను. దాని ఫలితంగానే రెండు పెనాల్టీలను ఆపగలిగాను. అవే మా గెలుపును నిర్ధారించాయి" అని 26 ఏళ్ల గిల్ చెప్పాడు. మ్యాచ్ మొత్తంలో జర్మనీ తమపై తీవ్ర ఒత్తిడి తెచ్చిందని, "అదొక హారర్ సినిమా చూసినట్లుంది. జర్మన్ ఆటగాళ్లు మైదానంలో ప్రతిచోటా కనిపిస్తూనే ఉన్నారు" అని వ్యాఖ్యానించాడు.జట్టు తరఫున గోల్ చేసిన జూలియో ఎన్సిసో మాట్లాడుతూ.. జర్మనీ గొప్ప జట్టు అయినప్పటికీ తాము భయపడలేదని స్పష్టం చేశాడు. "వారికి గొప్ప ఆటగాళ్లు ఉన్నారు కాబట్టి గౌరవించాం. కానీ, ఎవరికీ భయపడలేదు" అని ధీమా వ్యక్తం చేశాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం కోసం ఫ్రాన్స్, స్వీడన్ మధ్య జరిగే మ్యాచ్ విజేతతో పరాగ్వే తలపడనుంది. "తర్వాతి ప్రత్యర్థి ఎవరైనా, వారి ఆటగాళ్లు స్టార్స్ అయినా, మాకంటూ సొంత బలాలు, శైలి ఉన్నాయి. వాటితోనే వారిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తాం" అని ఎన్సిసో పేర్కొన్నాడు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## 'రంభ ఊర్వశి మేనక'.. మళ్లీ కామెడీ బాటపట్టిన అల్లరి నరేశ్




**మళ్లీ తన కామెడీ జోనర్‌లోకి వచ్చిన అల్లరి నరేశ్**

**పుట్టినరోజు సందర్భంగా 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ విడుదల**

**సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రానున్న 65వ చిత్రం**

**అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ సంయుక్త నిర్మాణం**

**సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల**

గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ప్రముఖ నటుడు అల్లరి నరేశ్, మళ్లీ తన ట్రేడ్ మార్క్ కామెడీతో అలరించేందుకు సిద్ధమయ్యారు. అల్లరి నరేశ్ పుట్టినరోజు సందర్భంగా తన 65వ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాకు 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని ఒక సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. టైటిల్‌తోనే సినిమాలో కామెడీ, ఫాంటసీ అంశాలు పుష్కలంగా ఉంటాయని స్పష్టమవుతోంది. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చంద్రమోహన్ చింతాడ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లరి నరేశ్ కామెడీ చిత్రాలకు పెట్టింది పేరు. అయితే, నటుడిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే క్రమంలో ఇటీవల సీరియస్ కథలను ఎంచుకున్నారు. ఇప్పుడు మళ్లీ తన కామెడీ జానర్‌లోకి వస్తుండటంతో అభిమానులు, సినీ ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ సినిమాకు చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 2026 సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

## ఇది ప్రభాస్ రేంజ్.. బ్యాంకాక్‌లో పూరి జగన్నాథ్‌కు ఎదురైన ఊహించని అనుభవం!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ క్రేజ్ దేశ సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా ఏ స్థాయిలో విస్తరించిందో చెప్పే ఓ ఆసక్తికర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. కేవలం 'నేను ప్రభాస్ స్నేహితుడిని' అని చెప్పినందుకు ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్‌కు బ్యాంకాక్‌లోని ఓ ఆసుపత్రిలో ఊహించని రీతిలో వీఐపీ ట్రీట్‌మెంట్ లభించింది. ఈ విషయాన్ని ప్రభాస్ స్వయంగా ఇటీవల విడుదలైన 'బాహుబలి: ది టార్చ్ బేరర్' అనే డాక్యుమెంటరీలో అభిమానులతో పంచుకున్నారు. ప్రభాస్ కథనం ప్రకారం.. 'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై ప్రపంచవ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తున్న రోజుల్లో ఈ సంఘటన జరిగింది. దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ చిన్న ఇన్ఫెక్షన్ కారణంగా చికిత్స కోసం బ్యాంకాక్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ తన వంతు కోసం వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని ఉండగా, ఓ నర్స్ ఆయన వద్దకు వచ్చి ఇండియా నుంచి వచ్చారా? అని అడిగింది. ఆయన అవునని సమాధానం ఇవ్వగానే, ఆమె వెంటనే 'బాహుబలి?' అని ప్రశ్నించింది. ఆమె ప్రశ్నకు ఆశ్చర్యపోయిన పూరి జగన్నాథ్, తన ఫోన్‌లోని ఓ పర్సనల్ ఫోటోను చూపించారు. ఆ ఫోటోలో ఆయన ప్రభాస్‌తో కలిసి ఉన్నారు. తాను ప్రభాస్‌కు మంచి స్నేహితుడినని ఆ నర్స్‌కు వివరించారు. ఆ ఫోటో చూసిన నర్స్ వెంటనే ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసింది. దీంతో పూరి జగన్నాథ్‌కు ఎలాంటి వెయిటింగ్ సమయం లేకుండా నేరుగా ఒక ప్రత్యేక గదికి తీసుకెళ్లి, తక్షణమే వైద్య సేవలు అందించారు. ఈ అనూహ్య అనుభవాన్ని పూరి జగన్నాథ్ వెంటనే వాయిస్ మెసేజ్ రూపంలో ప్రభాస్‌కు పంపించారు. ఆ సమయంలో దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ఉన్న ప్రభాస్, ఆ వాయిస్ మెసేజ్ విని ఆశ్చర్యానికి గురయ్యారు. జపాన్ వంటి దేశాల్లో 'బాహుబలి'కి, ప్రభాస్‌కు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని వారికి తెలుసు. కానీ, ఎవరూ ఊహించని విధంగా బ్యాంకాక్‌లోని ఓ సాధారణ ఆసుపత్రిలో కూడా 'బాహుబలి' ప్రభావం ఈ స్థాయిలో ఉండటం చిత్రబృందాన్ని సైతం ఆశ్చర్యపరిచింది. ఇది ప్రభాస్ గ్లోబల్ స్టార్‌డమ్‌కు నిదర్శనంగా నిలిచింది. ఇదే డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టిలు 'బాహుబలి 3' చిత్రంపై పరోక్షంగా కొన్ని హింట్స్ ఇవ్వడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఇక, ప్రభాస్ కెరీర్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ', సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్', అలాగే 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్ కూడా ఆయన లైనప్‌లో ఉన్నాయి.





## హీరోయిన్ హనీ రోజ్ కు క్షమాపణ చెప్పిన వ్యాపారవేత్త

కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్ హీరోయిన్ హనీ రోజ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఒక జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకలో హనీ రోజ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. తనపై లైంగిక భావనలతో కూడిన, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ హనీ రోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెమ్మనూర్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, బాబీ చెమ్మనూర్ తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా స్పందిస్తూ, తన వ్యాఖ్యలు హనీ రోజ్‌ను, ఆమె కుటుంబాన్ని బాధపెట్టాయని గ్రహించానని... ఈ ఉదంతానికి పూర్తి బాధ్యత వహిస్తూ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించారు. ఆమెను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఆమె తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ఈ వివాదంపై గతంలో మాట్లాడిన హనీ రోజ్... తన లుక్స్‌పై వచ్చే సరదా జోకులను, మీమ్స్‌ను తాను కూడా స్పోర్టివ్‌గా తీసుకుంటానని, కానీ ప్రతి దానికి ఒక హద్దు ఉంటుందని స్పష్టం చేశారు. అసభ్యకరమైన, గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. వ్యాపారవేత్త చెమ్మనూర్ చేసిన ఈ బహిరంగ క్షమాపణలపై హనీ రోజ్ ఇంకా స్పందించాల్సి ఉంది.

## 'సూపర్ సుబ్బు'తో ఓటీటీలోకి మురళీ శర్మ.. ఆసక్తికర పాత్రలో విలక్షణ నటుడు

విలక్షణ నటుడిగా సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మురళీ శర్మ, ఇప్పుడు ఓటీటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. ఆయన నెట్‌ఫ్లిక్స్ తొలి తెలుగు ఒరిజినల్ సిరీస్ అయిన 'సూపర్ సుబ్బు'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన కుక్కుటేశ్వర రావు అనే సంప్రదాయవాద తండ్రి పాత్రలో కనిపించనున్నారు. తన కొడుకు సెక్స్ ఎడ్యుకేషన్ టీచర్ కావాలని నిర్ణయించుకోవడంతో, ఆ తండ్రి నమ్మకాలు, సిద్ధాంతాలు ఎలాంటి కుదుపులకు గురయ్యాయనేది ఈ కథ యొక్క ముఖ్యమైన అంశం. తన ఓటీటీ అరంగేట్రంపై మురళీ శర్మ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కథ ప్రేక్షకులను నవ్విస్తూనే, సమాజంలో చర్చించడానికి ఇబ్బందిపడే కొన్ని సున్నితమైన విషయాలను సున్నితంగా చర్చిస్తుందని తెలిపారు. "కామెడీ, కుటుంబ డ్రామా, సామాజిక అంశాలను ఈ సిరీస్ అద్భుతంగా మిళితం చేసింది. నెట్‌ఫ్లిక్స్ తొలి తెలుగు సిరీస్‌లో భాగం కావడం గొప్ప అనుభవం. ఈ సిరీస్‌లోని మాకీపూర్ ప్రపంచం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది" అని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారనే విషయాన్ని కూడా మురళీ శర్మ పంచుకున్నారు. "టిల్లు స్క్వేర్ సినిమా షూటింగ్ సమయంలోనే దర్శకుడు మల్లిక్ ఈ సిరీస్ గురించి, నా పాత్ర గురించి చెప్పారు. ఆ సినిమాతో మా మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. అతను అధికారికంగా కథ వినిపించినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది" అని అన్నారు. గతంలో సందీప్ కిషన్‌తో ఐదు సినిమాలు, మిథిలా పాల్కర్‌తో ఒక తెలుగు సినిమా చేశానని, వారితో తనకున్న అనుబంధం కారణంగా సెట్స్‌లో వాతావరణం సరదాగా గడిచిపోయిందని మురళీ శర్మ పేర్కొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com